



మోగిన ఎన్నికల నగారా

ఇక ఎమ్మెల్సీ పోరు!

ఈ ఏడాది ఆరంభంలోనే ఎన్నికల సందడి మొదలైంది. చాలాకాలం నుంచి పట్టభద్రులు ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. ఇప్పటికే కార్యరంగం సిద్ధం చేసుకుని వివిధ వర్గాలతో అనేకమంది అభ్యర్థులు ఓటర్లతో మమేకం అవుతూ వస్తున్నారు. 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థుల గడువు ముగియనుండడంతో తిరిగి ఎన్నిక అనివార్యమైంది. ఈసారి టీడీపీ సహా పెద్ద సంఖ్యలోనే అభ్యర్థులు రంగంలో నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఆ మేరకు ఎన్నికల్లోను నువ్వానేనా అనేటట్టుగా అభ్యర్థులు ఢీకొనబోతున్నారు.



- ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల
- ఈసారి రంగంలో టీడీపీ అభ్యర్థి
- ఇప్పటికే ప్రచార పర్వంలోకి
- వామపక్షాలతోపాటు బరిలోకి అత్యధికులు
- హోరాహోరీ పోటీ తప్పదా..




పేరాబత్తుల రాజశేఖర్... దిడ్ల వీరరాఘవులు

(కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం / ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. దీంతో సమాంతరంగా ఎన్నికల 'కోడ్' కూసింది. ఇప్పటికే కూటమి తరపున టీడీపీ సహా మిగతా పక్షాలు తమ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు సన్నాహాల్లో ఉన్నాయి. కూటమి టీడీపీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను మూడు నెలల కిందటే రంగంలోకి దింపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఆరంభం నుంచి రాజశేఖర్ తన పని తాను చేసుకుంటూపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎమ్మెల్సీల్లో ఎన్నికల్లో పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి గెలిచేలా చూడాలని ఇప్పటికే టీడీపీ అధినాయకత్వం జిల్లాస్థాయి నాయకత్వాన్ని ఆదేశించింది. తాజాగా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రాజశేఖర్ గెలుపు పార్టీకి అత్యవసరమని, ఎక్కడా పొరపాట్లకు, లోటు పాట్లకు తావివ్వద్దని పార్టీ ముఖ్యుల భేటీలో సీఎం చంద్రబాబు సూచనలు జారీ చేశారు. బుధవారం రాజశేఖర్ అమరావతిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిమంత్రి నారా లోకేష్‌తో కూడా సమావేశమయ్యారు. ఇప్పటికే కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నేతల మద్దతు ఆయనకు లభించింది. దీంతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ఆరంభ దశలోనే ఆయనను ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించేలా పార్టీ ముఖ్యులు చొరవ చూపారు. అన్ని నియోజకవర్గాల్లోను పట్టభద్రుల ఓటర్ల చేరికలో చొరవ తీసుకోవాల్సిందిగా ఉభయగోదావరి జిల్లాల నేతలకు అప్పట్లోనే ఆదేశాలు అందాయి. దీంతో పార్టీ సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి మరీ రాజశేఖర్‌ను పార్టీ కేడర్‌కు పరిచయం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన వివిధ నియోజకవర్గాల్లో ఓటర్లతో సాన్నిహిత్యం పెంచుకుంటూ వస్తున్నారు. ఇంకోవైపు గడిచిన 2019లో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా అప్పట్లో వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి ఐ.వెంకటేశ్వరరావు గెలుపొందారు. విద్యావేత్త శేషారెడ్డిపై వెంకటేశ్వరరావు విజయం సాధించారు. ఆనాటి ఎన్నికల్లో వీరిద్దరి మధ్య హోరాహోరీగానే పోరు సాగింది. పట్టభద్రుల ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి రకరకాల ప్రయోగాలు చేశారు. వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి కాకుండా తమకు మద్దతు ఇస్తే అనూహ్యంగా సరైన స్థితిగతులు కల్పిస్తామంటూ మిగతా వారంతా పెద్దఎత్తున ప్రచారం సాగించారు. అయినప్పటికీ పట్టభద్రుల ఓటర్లు వెంకటేశ్వరరావు వైపే మొగ్గు చూపారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దిగకుండా జాగ్రత్తపడింది. ఈసారి వామపక్షాల మద్దతుతో తూర్పుగోదావరికి చెందిన దిడ్ల వీరరాఘవులు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. తాము బలపరిచిన అభ్యర్థి గెలుపొందేలా, ఉమ్మడి నిర్ణయం అమలయ్యేలా వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలో లేని పక్షానికే ఓటర్ల మొగ్గు ఉంటుందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాము బలపరిచిన అభ్యర్థే గెలుపొందుతారన్న ధీమాతో ఉన్నారు. దీనికితోడు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున అభ్యర్థులు పోటీకి దిగే అవకాశాలు స్పష్టంగా కనపడుతున్నాయి. గతం కంటే భిన్నంగా ఈసారి పట్టభద్రుల్లో చైతన్యం రావడం, ఓటర్ల జాబితాలో సంతృప్తికర స్థాయిలో ఓటర్ల నమోదు జరగడం మరో పరిణామం. సాధ్యమైనంత మేర ఓటర్లను ఆకర్షించడం, గెలుపుకు చేరువకావడం అనే రెండు లక్ష్యాలను సాధించేందుకు తహతహలాడుతున్నారు. ప్రతిపక్ష వైసీపీ నుంచి పోటీ ఉంటుందా లేదా ఎవరికైనా మద్దతుగా నిలుస్తుందా.. స్పష్టత లేదు.

పురుష ఓటర్లదే ఆధిక్యత

గడిచిన మూడు మాసాలుగా ఓటర్ల జాబితాలో చేరికలు భారీగానే సాగాయి. నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కూటమి ముఖ్య నేతలు పట్టుపట్టి మరీ ఓటర్ల చేరికను ప్రోత్సహించారు. గడిచిన నెలన్నర కిందట ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్ల జాబితాలో కేవలం లక్షా 27 వేల మంది నమోదయ్యారు. ఆ తదుపరి నియోజకవర్గాల వారీగా సమీక్ష సాగడంతో ఒక్కసారిగా ఈ సంఖ్య ఎక్కడికక్కడ పెరుగుతూ వచ్చింది. మొత్తం ఓటర్ల సంఖ్య మూడు లక్షల 15 వేల 261గా ఉంది. వీరిలో పురుష ఓటర్ల సంఖ్య లక్షా 83 వేల 734 కాగా, అదే మహిళా ఓటర్ల సంఖ్య వీరికంటే తక్కువగా లక్షా 31 వేల 507గా లెక్క తేలింది. అంటే పట్టభద్రుల నియోజకవర్గంలో పురుష ఓటర్లే గెలుపోటములకు నిర్ణేతలు కాబోతున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 602 మంది ఓటర్లు ఉండగా అదే పశ్చిమగోదావరిలో 69 వేల 884 మంది ఉన్నారు. ఓటర్ల జాబితాలో పట్టభద్రులకు చోటు కల్పించే దిశగా ఏపీ ఎన్జీవోలు ఒకింత చొరవ చూపారు.

- నేటి నుంచి అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల
- 27న పోలింగ్.. మార్చి 3న కౌంటింగ్

కాకినాడ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నిక నగరా మోగింది. ఏపీలో రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం షెడ్యూల్ విడుదలైంది. తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. 10వతేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ గడువుగా ప్రకటించారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ప్రక్రియ 8వ తేదీలోగా ముగించాల్సి ఉంది. ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఇంతవరకు ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 3 లక్షల15 వేల 261మంది పట్టభద్రుల ఓటర్ల నమోదు జరిగింది. ఇదిలా ఉండగా, ఈనెల 31వ తేదీ వరకు పట్టభద్రుల ఓటర్ల నమోదుకు గడువు ఉంది.

సీఎం చంద్రబాబు పర్యటన రద్దు

పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఫిబ్రవరి 1న కొవ్వూరు మండలంలోని దొమ్మేరులో జరగాల్సిన సీఎం చంద్రబాబునాయుడు పర్యటన రద్దు అయింది. పేదల గృహ ప్రవేశాలు ప్రారంభం, పింఛన్ల పంపిణీతో పాటు ఇక్కడ సభ నిర్వహించడానికి తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లుచేసింది. తాజాగా సీఎం పర్యటన ఇక్కడ రద్దుచేసి అన్నమయ్య జిల్లాకు సీఎం సభను మార్చారు.

పరిష్కారం దిశగా అడుగులు

- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదికతో అధికారుల్లో కదలిక
- పిఠాపురం 18వ వార్డులో సమస్యలపై దృష్టి
- 24గంటల వ్యవధిలోనే పలు సమస్యల పరిష్కారం

పిఠాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై మునిసిపల్ అధికారులు, సిబ్బంది దృష్టి కేంద్రీకరించారు. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. పైపులైన్లు, కుళాయిలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకుగాను ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' పిఠాపురం పట్టణంలోని 18వవార్డు కుంతీమాధవస్వామి ఆలయంవద్ద నిర్వహించిన చర్చావేదికలో ప్రజలు పలు అంశాలను అధికారులు,ప్రజాప్రతినిధులు, నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వేదిక ముగిసిన రెండు గంటల వ్యవధిలోనే ఫాగింగ్ చేసి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టిన మునిసిపల్ అధికారులు బుధవారం మరిన్ని చర్యలు చేపట్టారు. మునిసిపల్ కమిషనరు నామా కనకారావు ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ వార్డులోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి పబ్లిక్ కుళాయిలు, పైపులైన్లు పరిశీలించారు. గుట్లవీధి, రెడ్డెం వారి వీధి తదితర ప్రాంతాల్లో అలంకారప్రాయంగా ఉన్న పబ్లిక్ కుళాయిలను బుధవారం వినియోగంలోకి తీసుకువచ్చారు. వాటికి నీరు వచ్చే పైపలైన్లు మార్చి కుళాయిలకు ట్యాప్‌లు బిగించారు. తిమ్మరాజువీధిలో తాగు నీటిసరఫరా మెరుగుకు పైపులైను ఏర్పాటు చేశారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి

18వ వార్డులోని అన్నిప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టారు. ఉదయం నుంచే వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారాన్ని, డ్రైన్లల్లో పూడికను తొలగించారు. ఇళ్లవద్ద డస్ట్‌బిన్లల్లో ఉన్న చెత్తను సేకరించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఇంటింటా చెత్తను సేకరించడం లేదన్న తమ ఫిర్యాదులకు అధికారులు స్పందించి సేకరించడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. వార్డులోని అన్ని ప్రాంతాల్లో పైపులైన్లు పరిశీలించి అవసరమైతే మార్పు చేస్తామని అధికారులు తెలిపారు.



పిఠాపురంలోని రెడ్డెం వారి వీధిలో కుళాయికి బిగించిన ట్యాప్‌నుంచి వస్తున్న నీరు



పిఠాపురం తిమ్మరాజు వీధిల్లో ఇంటింటా చెత్త సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది



పిఠాపురం 18వ వార్డులో డ్రైన్లల్లో పూడిక తొలగిస్తున్న దృశ్యం

1న జిల్లాలో రూ.116.68కోట్ల పెన్షన్ల పంపిణీకి సన్నాహాలు

కాకినాడ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి 1న 2,72,437మంది పెన్షన్‌దారులకు రూ.116.68కోట్లు పెన్షన్‌లు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం ద్వారా ఈ సాయం అందించనున్నారు. 1న పెన్షన్లు తీసుకోని పెన్షన్‌దారులకు 3న పంపిణీ చేయనున్నారు. 1న పెన్షన్ సొమ్ముతోపాటు రెండు నెలలు తీసుకోనివారికి ఇవ్వనున్నారు.



కాకినాడ కుంభాభిషేకం బీచ్ వద్ద బైక్ ర్యాలీలో పాల్గొన్న కోస్టుగార్డు సిబ్బంది

కోస్టుగార్డు సేవలపై అవగాహనకు కమ్యూనిటీ ప్రోగ్రాం

- 49వ రైజింగ్ డే సందర్భంగా కాకినాడ-నిజాంపట్నం వరకు బైక్ ర్యాలీ

జీజీహెచ్(కాకినాడ), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సముద్ర ప్రయోజనాలు, తీరప్రాంత రక్షణలో కోస్టుగార్డు ప్రముఖపాత్ర పోషిస్తుందని, కోస్టుగార్డు సముద్ర దళం సేవలు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీతో తీరప్రాంతాల ప్రజలతో కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కమాండింగ్ ఆఫీసర్ తెలిపారు. కాకినాడ ఇండియన్ కోస్టుగార్డు ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ కుంభాభిషేకం తీరప్రాంతంలో 49వ రైజింగ్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర మార్గం గుండా అక్రమ చొరబాట్లు, స్మగ్లింగ్, అక్రమ రవాణా అరికట్టేందుకు కోస్టుగార్డు దళం పనిచేస్తుందన్నారు. తీరప్రాంతం, సముద్రంపై ఆధారపడిజీవించే మత్స్యకారులు సముద్ర ప్రయోజనాలు పరిరక్షించడంలో కోస్టుగార్డుతో భాగస్వామ్యంతో పనిచేసి తీర రక్షక దళాలకు సహకారం అందించాలని కోరారు. 49వ రైజింగ్ డే సందర్భంగా కాకినాడ నుంచి నిజాంపట్నం వరకు చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి కమాండింగ్ ఆఫీసర్ ప్రారంభించారు. కార్యక్రమంలో 35మంది మత్స్యకారులతోపాటు మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ, పోర్టు శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇద్దరు న్యాయమూర్తులకు పదోన్నతులు

కాకినాడ క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న పలువురు జడ్జిలకు పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సివిల్ జడ్జిలు(సీనియర్ డివిజన్)లను జిల్లా న్యాయమూర్తులుగా పదోన్నతులు కల్పించి బదిలీ చేసింది. కాకినాడ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్)గా పనిచేస్తున్న కనుగుల శైలజను ప్రకాశం జిల్లా ఒంగోలు పోక్సో లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం కింద నేరాల విచారణ కోసం ప్రత్యేక కోర్టు జిల్లాస్థాయి న్యాయమూర్తిగా నియమిస్తూ బదిలీ చేశారు. అనంతపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.శంకర్‌రావును తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం అదనపు జిల్లా, సెషన్ల జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

మాఘం.. సకల శుభాల మాసం 6
- నేటి నుంచి పెళ్లిళ్లు, గృహప్రవేశాలు

సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు వేటూరి పురస్కారం 6

పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీ 7
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రేమ పేరుతో మోసగించి.. వ్యభిచార వృత్తిలోకి దింపి.. 7

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు 7

బోటుకు.. చోటొచ్చేసినట్టే!



ఉప్పాడలో శరవేగంగా జరుగుతున్న అమీనాబాద్ ఫిషింగ్ హార్బర్ పనులు

- ఉప్పాడలో అమీనాబాద్ ఫిషింగ్ హార్బర్‌కు వీడిన గ్రహణం
- మరో ఐదు నెలల్లో హార్బర్ ప్రారంభానికి ప్రభుత్వం సన్నాహాలు
- కూటమి వచ్చిన తర్వాత గ్రహణం వీడి వడివడిగా జరుగుతున్న పనులు
- పూర్తికావచ్చిన కొత్త జెట్టీ: అంతర్గత భవనాల నిర్మాణం షురూ
- ఐదేళ్లపాలనలో హార్బర్‌ను గాలికి వదిలేసిన అప్పటి వైసీపీ ప్రభుత్వం
- 2018లో హార్బర్‌ను మంజూరు చేసింది.. ఇప్పుడు పూర్తిచేసి ప్రారంభించేది టీడీపీయే

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)


ఉప్పాడలో అమీనాబాద్ ఫిషింగ్ హార్బర్‌కు పట్టిన గ్రహణం వీడింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడికక్కడ పడకేసిన పనులకు మోక్షం కలిగింది. కూటమి సర్కారు రావడంతో ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. మరో ఐదు నెలల్లో దీన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. తాజాగా దీని నిర్మాణ పురోగతిపై సమీక్షించిన సర్కారు జూన్ నెలాఖరుకు హార్బర్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. ఈలోపు మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించింది. హార్బర్‌ను అదిగో ప్రారంభించేస్తున్నామంటూ గత వైసీపీ సర్కారు నాలుగుసార్లు తేదీలు ప్రకటించింది. తీరా కాంట్రాక్టర్‌కు నిధులు ఇవ్వకపోవడంతో పనులు కదల్లేదు. దీంతో గడువులు అంతకంతకూ వాయిదాపడి ప్రభుత్వం అభాసుపాలైంది. ఇప్పుడు ప్రభుత్వం మారి కూటమి సర్కారు రావడంతో పనులు ఊపందుకుని హార్బర్ ప్రారంభోత్సవం దిశగా అడుగులు పడుతున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే హార్బర్‌ను మంజూరు చేసింది. పూర్తి చేసి త్వరలో ప్రారంభించబోతోంది సీఎం చంద్రబాబే కావడం విశేషం.

టీడీపీ శంకుస్థాపన చేస్తే..

కాకినాడలో మత్స్యకారులకు డీప్‌వాటర్ పోర్టుకు సమీపంలో ఫిషింగ్ హార్బర్ ఉంది. ఇక్కడ రద్దీ అధికంగా ఉండడంతో తరచూ వేటాడివస్తోన్న మత్స్యకారులకు చోటు సరిపోయేది కాదు. ఫలితంగా తరచూ మత్స్యకారుల మధ్య గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ సమీపంలోని అమీనాబాద్‌వద్ద కొత్తగా హార్బర్ నిర్మిస్తే మత్స్యకారుల వేటకు ఇబ్బంది ఉండదని గత టీడీపీ ప్రభుత్వం భావించింది. ఇదే విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే వర్మ సీఎం చంద్రబాబు దృష్టికి పలుసార్లు తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ఇక్కడ మత్స్యకారుల అవసరాలను గుర్తించిన టీడీపీ ప్రభుత్వం అమీనాబాద్‌లో హార్బర్ నిర్మాణానికి అంగీకారం తెలిపింది. నిర్మాణ వ్యయంపై అధికారులతో అంచనాలు తయారు చేయించగా రూ.300కోట్ల వరకు ఖర్చవుతుందని తేల్చారు. దీంతో టెండర్లు పిలవడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేయగా, ఈలోపు ఎన్నికలు వచ్చాయి. తీరా వైసీపీ అధికారంలోకి రావడంతో అప్పటినుంచీ ప్రాజెక్టు మూలనపడిపోయింది. మత్స్యకారుల నుంచి, ప్రతిపక్ష టీడీపీ నుంచి ఆందోళనలు పెరగడంతో తిరిగి 2020, నవంబరు 21న ఉప్పాడ హార్బర్ నిర్మాణానికి అప్పటి సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. తీరా అప్పటికే పనులు ఆలస్యం కావడంతో నిర్మాణ వ్యయం రూ.422 కోట్లకు పెరిగింది. ఇందులో కేంద్రం సగం, రాష్ట్ర ప్రభుత్వం సగం నిధులు భరించాలని నిర్ణయించాయి. హార్బర్ నిర్మాణంలో భాగంగా 2,500 బోట్లు బెర్తింగ్ సామర్థ్యం కల్పించడంతోపాటు ఫిష్ హ్యాండ్లింగ్, వేలం హాలు, ట్యునాషిప్ హ్యాండ్లింగ్, ప్యాకింగ్, ఫిష్ డ్రెయింగ్ యార్డ్, మత్స్యకారులకు శిక్షణ కేంద్రం, వలల మెండింగ్ షెడ్, బోట్ల మరమ్మతు కేంద్రం, ఐస్‌ప్లాంట్, కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలనేది నిబంధన. ఇవన్నీ తమ ప్రభుత్వం 2022నాటికి పూర్తిచేస్తుందని అప్పట్లో సీఎం జగన్ గొప్పగా ప్రకటించారు. దీంతో అంతా నిజమేననుకున్నారు. ఈ పనులు చేపట్టడానికి వీలుగా అప్పట్లో ఉప్పాడ హార్బర్‌తోపాటు మరో మూడు హార్బర్‌లకు కలిపి ఒకేసారి రాష్ట్రప్రభుత్వం టెండర్లు పిలిచింది. వీటన్నింటినీ హైదరాబాద్‌కు చెందిన ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అనే కంపెనీ దక్కించుకుంది. అప్పటినుంచి నిధులు బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులే చేయలేదు. దీంతో మొక్కుబడిగా తనకు అనుకూలంగా ఉన్న ఓ సబ్ కాంట్రాక్టు కంపెనీకి నిర్మాణ పనులు అప్పగించి చేతులు దులిపేసుకుంది. అప్పటినుంచీ హార్బర్ పనులు మొక్కుబడిగా మారాయి. 2022లో అమరావతి నుంచి ఉన్నతాధికారుల బృందం వచ్చి హార్బర్ నిర్మాణ పనులు పరిశీలించి 2023 మార్చి నాటికి హార్బర్ పూర్తయిపోతుందని ప్రకటించి వెళ్లిపోయింది. తీరా అప్పటికి క్షేత్రస్థాయిలో పది శాతం పనులు కూడా పూర్తికాలేదు. శంకుస్థాపన చేసిన తర్వాత ఈహార్బర్‌కు సంబంధించి బ్రేక్ వాటర్ రాళ్ల వేయడంతోపాటు జెట్టీల నిర్మాణానికి సముద్రం అడుగునుంచి పిల్లర్లు నిర్మించుకు రావాలి. కాంక్రీట్ పనులు 2022 చివరకు దాదాపు పూర్తికావాలి. తీరాన్ని ఆనుకుని గోదాములు, ఇతర భవనాలు పూర్తి చేయాలి. కానీ బిల్లులు రాక ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో 2022 గడువు కూడా దాటిపోయింది. అయినా పనులు కదలక ప్రారంభోత్సవ ప్రకటన డొల్లగా మారిపోయింది. ఆ తర్వాత మళ్లీ ప్రభుత్వం మాట మార్చింది. 2023 మార్చికి హార్బర్‌ను ప్రారంభిస్తామని ఇంకోసారి గొప్పలు చెప్పింది. చివరకు ఆ గడువు కూడా దాటిపోయింది. పనులు సగం కూడా అవలేదు. దీంతో మళ్లీ 2023, అక్టోబరుకు కచ్చితంగా ప్రారంభిస్తామని ప్రభుత్వం ఇంకోసారి గడువు పొడిగించింది. అప్పట్లో మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పనులు జరుగుతున్న హార్బర్‌ప్రాంతం వద్దకు వచ్చి ప్రారంభించేస్తున్నామంటూ కబుర్లు చెప్పారు. కానీ పనులేవీ కదల్లేదు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు కూడా వచ్చేశాయి. అప్పటికి జెట్టీ దగ్గరనుంచి ఫిష్ హ్యాండ్లింగ్, వేలంహాలు, ట్యునాషిఫ్ హ్యాండ్లింగ్, ప్యాకింగ్, షిఫ్ డ్రెయింగ్ యార్డ్, మత్స్యకారులకు శిక్షణ కేంద్రం, వలల మెండింగ్ షెడ్, బోట్ల మరమ్మతు కేంద్రం, ఐస్‌ప్లాంట్, కోల్డ్ స్టోరేజీలు పూర్తికాలేదు. ఇలా అబద్ధాలతో వైసీపీ ప్రభుత్వం అప్పట్లో మత్స్యకారులను మోసం చేసింది. కాంట్రాక్టరేమో తనకు రూ.150కోట్ల వరకు బిల్లులు ఆగిపోవడంతో ప్రభుత్వం తీరుపై విసిగిపోయి పనులు ఆపేసి వెళ్లిపోయాడు.

కూటమి రాగానే చకచకా...

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొత్తగా కొలువుదీరగానే హార్బర్ నిర్మాణం ఊపందుకోవడం ఖాయమని మత్స్యకారులు భావించారు. దీనికి తగ్గట్టుగానే ప్రభుత్వం దీని పూర్తిపై దృష్టిసారించింది. మత్స్యకారులకు ఏఇబ్బంది లేకుండా 2025లో పూర్తిచేస్తామని స్పష్టం చేసింది. అందులోభాగంగా కాంట్రాక్టర్‌ను, అధికారులను పిలిచి వరుసగా సమీక్షలు నిర్వహించింది. ఏ పనులు ఏయే దశల్లో ఉన్నాయో ఆరా తీసింది. తక్షణం వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించింది. అటు పోర్టులశాఖ మంత్రి సైతం ఇటీవల అమరావతిలో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిపై ఆరా తీయగా, ప్రభుత్వం వచ్చిన తర్వాత గడిచిన కొన్నినెలల్లో పనులు వేగవంతం చేయడంవల్ల 60శాతం వర్కు పూర్తయిందని మంత్రికి వివరించారు. ప్రస్తుతం లోపల జెట్టీ నిర్మాణం దాదాపు పూర్తయింది. అంతర్గత రహదారులు, మత్స్యకారులకు అవసరమైన వివిధ భవనాల నిర్మాణం మాత్రమే పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. ఇవి ఏ నెలలో ఎంతశాతం జరుగుతాయో కూలంకుషంగా ఆరా తీయగా, ఐదునెలల్లో మొత్తం పూర్తవుతాయని ఇంజనీర్లు వివరించారు. ప్రస్తుతం కీలకమైన జెట్టీ దాదాపు పూర్తయిన నేపథ్యంలో మిగిలిన భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. దీంతో ఈ ఏడాది జూన్ నెలాఖరునాటికి హార్బర్‌ను ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈలోగా ఎప్పటికప్పుడు తమకు పనుల పురోగతి తెలపాలని కూటమి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.



బంగారు పాప ఆలయం, ఆమె రూపం (ఇక్కడే కోరికలు మొక్కుకుంటారు) (కింద)



హిందూ, ముస్లింల ఆరాధ్య దైవం

బంగారు పాప

పొన్నాడలో వచ్చే నెల 7 నుంచి ఉరుస్ ఉత్సవాలకు ముజావర్ల ఏర్పాట్లు

కొత్తపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో బషీర్‌బీబీ ఔలియా (బంగారు పాప) హిందూ, ముస్లింల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటోంది. మహా శక్తి సంపన్నురాలు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన బంగారు పాపను దేశం నలుమూలల నుంచి అనేక మంది విచ్చేసి మొక్కులు చెల్లించుకుంటారు. బంగారు పాపను ఒకసారి దర్శించుకున్న తర్వాత సంతానం లేని దంపతులకు సంతానం, వివాహం కాని యువతీ, యువకులకు వివాహం జరుగుతుందని ప్రతీతి. దీంతో ప్రతి సంవత్సరం మాఘ మాసంలో మూడు రోజుల పాటు జరిగే బంగారు పాప ఉరుస్ ఉత్సవాలకు భక్తులు పోటెత్తుతారు. బంగారు పాప మహాసంపన్నురాలు కావడంతో పొన్నాడ గ్రామంలో పేదరికంలో ఉండి నీతి, నిజాయితీ కలిగిన కుటుంబాల్లో వివాహ వేడుకలకు బంగారు ఆభరణాలను సమకూర్చేదని, వివాహం అనంతరం తిరిగి బంగారు పాపకు ఇచ్చేవారని ముస్లిం పెద్దలు చెప్తున్నారు. పిఠాపురం పట్టణానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొన్నాడ గ్రామంలో ఎప్పుడో బంగారు పాపకు నిర్మించిన ఏడు అంతస్తుల భవనంలో 6 అంతస్తులు భూమిలో దిగబడి ఉండడం గమనార్హం. కింద అంతస్తులో బంగారుపాపగా భావించే పచ్చరంగు కర్టెన్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి పొన్నాడలో జరిగే ఉరుస్ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు భోజన, వసతి సౌకర్యాలను సమకూర్చడంలో స్థానిక ముజావర్లు నిమగ్నమయ్యారు.



మాఘం... సకల శుభాల మాసం



- నేటి నుంచి పెళ్లిళ్లు, గృహ ప్రవేశాల సందడి
- ఒక్క మాఘ మాసంలోనే సత్యదేవుని సన్నిధిలో సుమారు 600, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5వేల వివాహాలు జరగొచ్చని అంచనా



అన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్లు, గృహప్రవేశాలు తదితర శుభ కార్యక్రమాలకు ముందుగా గుర్తొచ్చేది మాఘ మాసమే. ఎందుకంటే ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభమైన తర్వాత తరువాత మొదటగా వచ్చే శుభం కలిగే మాసంగా దీనిని పండితులు పరిగణిస్తుంటారు. ఉత్తరాయనం పుష్య మాసంలో వచ్చినా అది శూన్యమాసం కావడంతో శుభ కార్యక్రమాలు చేపట్టరు. గురువారం నుంచి మాఘ మాసం ప్రారంభమవుతుండగా వివాహాది శుభ కార్యక్రమాలు మొదటి రోజు నుంచే ప్రారంభం కానున్నాయి. 30న ప్రారంభమయ్యే పెళ్లిళ్ల సందళ్లు వైశాఖ మాసం వరకు కొనసాగనున్నాయి. అయితే ఒక్క మాఘ మాసంలోనే సత్యదేవుడి సన్నిధిలో సుమారు 600 వరకు వివాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే చాలా పెళ్లి బృందాలు వివాహ వేదికలను బుక్ చేసుకోగా మరికొందరు ఎటువంటి అడ్వాన్సు చెల్లించకుండా అమావాస్య ముగిసిన తర్వాత చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నారు. మాఘమాసంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5వేల పెళ్లిళ్లు జరగొచ్చని అంచనా వేస్తున్నారు. జనవరి 30, 31తో పాటు ఫిబ్రవరి నెలలో 2, 3, 7, 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25 తేదీల్లో వివాహ ముహూర్తాలున్నాయి. 7, 15, 18, 20, 22 తేదీల్లో ముహూర్తాలు మరింత బలమైనవని పండితులు చెప్తున్నారు. మార్చి నెలలో 8 రోజులు, ఏప్రిల్ నెలలో 12 రోజులు, మే నెలలో 10 రోజులు వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయన ముహూర్తాలున్నాయని పంచాంగకర్తలు పేర్కొన్నారు. వరుస శుభ కార్యక్రమాలతో పురోహితులు, సన్నాయిమేళం, క్యాటరింగ్, డెకరేషన్ మండపాలకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. వీరు ధరలను అమాంతం పెంచేస్తూ వివాహ బృందాల నడ్డివిరిచేస్తున్నారు.



మెండుగా శుభ ముహూర్తాలు

కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి



అమలాపురం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాఘ మాసం ఎప్పుడు వస్తుందోనని నవ వధూవరులు ఎదురు చూస్తుంటారు. ఆ మాసం రానే వచ్చింది. వివాహాది శుభ ముహూర్తాలు మాఘ మాసంలో మెండుగా ఉన్నాయని బండారులంకకు చెందిన ఈశ్వర పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు.

వివాహం: ఈ నెల 31, ఫిబ్రవరి 2, 8, 12, 15, 16, 18, 20, 22, 23

శంకుస్థాపన: ఫిబ్రవరి 3, 8, 10, 15, 16, 17, 18, 20.

గృహప్రవేశం: ఈ నెల 31, ఫిబ్రవరి 2, 8, 10, 15, 16, 17, 20

మాఘ మాసంలో ముఖ్య పండుగలు..

ఫిబ్రవరి 2న శ్రీపంచమి, 4న తేదీ రథసప్తమి, 5న భీష్మాష్టమి, 8న భీష్మ ఏకాదశి, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి తీర్థం, 12న మహామాఘి కుంభ సంక్రమణం, 16న సంకష్టహర చతుర్థి, 26న మహాశివరాత్రి, 27న ముమ్మిడివరం బాలయోగీశ్వరుల తీర్థం.

ఫాల్గుణ మాసంలో..

ఫిబ్రవరి 28 నుంచి మార్చి 29 వరకు

వివాహం: మార్చి 1, 2, 6, 7, 12, 14, 15.

శంకుస్థాపన: మార్చి 1, 2, 3, 6, 7, 9, 14, 15

గృహప్రవేశం: మార్చి 1, 2, 6, 7, 9, 14

ముఖ్య పండుగలు..

మార్చి 10న కోరుకొండ తీర్థం, 13న హోళీ, 15న వసంతోత్సవం, 16 నుంచి 29వ తేదీ వరకు శుక్ర మౌఢ్యమి, 30న ఉగాది.



మీర్ జవాద్ అలీ కెమెరాతో తీసిన ప్రకృతి సోయగం చిత్రం

ప్రకృతి (చిత్ర) సోయగం

మామిడికుదురు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వర్క్‌షాప్ జరిగింది. పంట కాల్వలో పసుపు రంగు తెరచాపతో ఉన్న పడవలో మత్స్యకారుడు వల విసురుతున్న దృశ్యాన్ని మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మీర్ జవాద్ అలీ అలీ తన కెమెరాలో బంధించాడు. ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో రజత పతకం లభించింది.

సత్యదేవుని సన్నిధిలో ఎస్‌పీఎఫ్ ఐజీ



ఎస్‌పీఎఫ్ ఐజీ రామిరెడ్డికి సత్యదేవుని మెమెంటో అందజేస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి బుధవారం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి విచ్చేశారు. ఆయనకు పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఐజీకి వేదపండితులు వేదాశీర్వచనాలు ఇవ్వగా పీఆర్వో స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ భద్రతకు సంబంధించి దేవస్థానం ఎస్‌పీఎఫ్ సిబ్బందికి ఐజీ పలు సూచనలు చేశారు.

నేడు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది హాజరు కావాలన్నారు.



కరప మండలం ఉప్పలంకలో తీర్థంలో భాగంగా గరగలు, వీరభద్రుడి ఊరేగింపు



భక్తులతో కిక్కిరిసిపోయిన యానాం జాతీయరహదారి

భక్త 'జనసంద్రం'

- చొల్లంగి తీర్థానికి పోటెత్తిన భక్తులు
- జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది రాక
- సముద్ర స్నానాలాచరించి స్వామివారి దర్శనం
- ఏర్పాట్లు చేసిన కమిటీలు

కరప, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రాశస్త్యం కలిగిన చొల్లంగి అమావాస్య తీర్థానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు కరపమండలం ఉప్పలంక శివారు మొండి గ్రామం విచ్చేసి సముద్ర తీరాన కొలువుదీరిన బాలత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి సముద్ర స్నానాలాచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చొల్లంగిలోని రాజరాజేశ్వరిదేవి సమేత సోమేశ్వరస్వామి, కాలభైరవస్వామి, సీతారామాంజనేయ స్వామివార్లను కూడా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కరప, తాళ్లరేవు, కాజులూరు, తదితర మండలాల నుంచి వీరభద్రుని ప్రభలు, గరగలను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అలాగే అప్పన్నెద్దులను కోలసంబరం పాటలు, నృత్యాలతో తోలుకువచ్చి సముద్ర స్నానాలు చేయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, దేవాదాయశాఖ సిబ్బంది స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను, వైద్యసేవల కోసం శిబిరాన్ని, తాగునీటి వసతి, అన్నదానం ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం నుంచి అప్పనెద్దులకు ప్రవేశం కల్పించగా వాటికి సముద్ర స్నానాలు చేయించి స్వామివారి దర్శించుకున్నారు. సంగమ ప్రదేశం వద్ద జంగమ దేవరులు పలువురిచే పిండ ప్రదానం చేయించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శివపార్వతులకల్యాణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తులు ఆసక్తితో తిలకించారు. కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, పెదపూడి, ఇంద్రపాలెం, గొల్లపాలెం, కాకినాడ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీతో యానాం జాతీయరహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలను మళ్లించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మల్లాడి కార్తీక్‌నాయకర్, ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు సందీప్, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఎంఎస్ఎన్ చార్టీస్ ఈవో కె.విజయలక్ష్మి, ఇతర ఈవోలు మోర్తా మురళీవీరభద్రరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, సర్పంచ్ బొమ్మిడి నయోమి సతీష్, ఈవోపీఆర్డీ సలాది శ్రీనివాసరావు, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



కరప మండలంలో విశేషాలంకరణలో బాల త్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామి



పిండ ప్రదానాలు జరుపుతున్న జంగం దేవరులు

బ్రహ్మ సమేధ్యంలో...

కాట్రేనికోన, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం సమీపంలోని బ్రహ్మసమేధ్యంలో చొల్లంగి అమావాస్య వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బ్రహ్మదేవుడు లింగ రూపంలో, కాలభైరవుడు క్షేత్రపాలకుడుగా ఉన్న ఈ పుణ్యక్షేత్రం అత్యంత మహిమాన్వితమైనదిగా భక్తుల నమ్మకం. సంతానార్థులైన మహిళలు రాత్రి సమయంలో గుడి ఆవరణలో నిద్రించి, సంతానం ప్రాప్తికి పూజలు చేశారు. రాత్రి జాగారం తర్వాత భక్తులు సముద్ర స్నానమాచరించి, బ్రహ్మదేవుని దర్శించుకున్నారు. తమ కోర్కెలు నెరవేరిన భక్తులు ఇక్కడ కొబ్బరి మొక్కలు నాటారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల కోసం కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పల్లం శ్రీకాలభైరవస్వామి అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగిడి నాగేశ్వరరావు, దాట్ల పవన్, దాట్ల పృథ్వి, చెల్లి అశోక్, దండుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వరరావు, దండుప్రోలు బాలయ్య, మల్లాడి అన్నవరం, అంగాని నరసింహమూర్తి, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



తీర్థంలో గంగిరెద్దుల కోలాహలం



కాట్రేనికోన బ్రహ్మదేవుని ఆలయ ఆవరణలో నిద్రిస్తున్న మహిళలు

వేటూరి పురస్కారం....

నా పూర్వజన్మ సుకృతం

- ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ
- తుని చిట్టూరి మెట్రోలో అట్టహాసంగా వేటూరి సాహితీ పురస్కార వేడుక
- భారీగా హాజరైన వేటూరి సాహితీ అభిమానులు, ప్రజలు



తునిలో సినీ గేయ రచయిత అశోక్ తేజకు వేటూరి పురస్కారం అందజేసి సత్కరిస్తున్న నిర్వాహకులు

తుని రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు నేలపై వేటూరి సాహితీ పురస్కారం పొందడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తెలిపారు. వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా ఏటా నిర్వహించే వేటూరి సాహితీ పురస్కార వేడుక తుని చిట్టూరి మెట్రోలో కన్నుల పండుగగా జరిగింది. 14 ఏళ్లుగా నిర్విరామంగా జరుగుతున్న ఈ వేడుకలో పలువురు రచయితలను నిర్వాహకులు ఘనంగా సత్కరిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది సినీ గేయ రచయిల సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసి కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రముఖులు, వేటూరి సాహితీ అభిమానుల మధ్య నిర్వాహకులు సుద్దాల అశోక్‌తేజకు వేటూరి పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గేయ రచయిత సుద్దాల అశోక్ మాట్లాడుతూ వేటూరి వంటి మహనీయులు జయంతి వేడుకను తునిలో ఇంత వైభవంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఇది సాహిత్యానికి ఇస్తున్న గౌరవంగా ఆయన అభివర్ణించారు. వేటూరి వంటి మహనీయులను అభిమానించడం అంటే అక్షరాలను పూజించడం ఆరాధించడం అన్నారు. కవులు ఉన్నంత కాలం తెలుగు భాష వైభవం తగ్గదని 1994లో సినీ రంగంలోకి ప్రవేశించానని, ఎన్నో పాటలు ప్రయోగాలతో నేటికీ 3000 పైబడి పాటలు రచించానన్నారు. తన తండ్రిలో ఉన్న విప్లవ పదజాలం ఆత్రేయ గారి సరళి వలనే తన పాటలకు ప్రత్యేకమైన గుర్తింపని, వేటూరి వంటి మహనీయులు తమకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సినీ దర్శకుడు శేఖర్ కమ్ములతో కలిసి సాహితీ అభిమానులు 150 పుస్తకాలతో సుద్దాల అశోక్‌తేజను ఘనంగా సత్కరించారు. దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ సుద్దాల అశోక్‌తేజ ఈ పురస్కారానికి అర్హులని, ఈ వేడుకలో పాలుపంచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పిల్లలు వేటూరి పాటలు వింటే సాహిత్యంపై అవగాహన పెరుగుతుందన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ వేటూరి సాహితీ పీఠం ద్వారా ప్రతిఏటా పురస్కారాలు ప్రదానం చేయడం వేటూరికి తాము ఇచ్చే నివాళిగా భావిస్తున్నామన్నారు. వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ, వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మతో పాటు తుని, పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు, వేటూరి అభిమానులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా ఆధునికీకరణకు రూ.19.37 కోట్లు

- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా ఆధునికీకరణకు రాష్ట్రప్రభుత్వం రూ. 19.37 కోట్ల నిధులు మంజూరు చేసిందని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నిధులతో గోదావరి డెల్టాలో 122 పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన రెండో అసెంబ్లీ సమావేశాన్ని గోదావరి డెల్టా ఆధునికీకరణపై తాను లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం స్పందించిందన్నారు. ఈ నిధులతో గోదావరి డెల్టాలో పంట కాలువలు, మురుగునీటి కాలువలను శుభ్రం చేస్తారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం మళ్లీ గాడిలోకి తేస్తుండడంతో రైతులకు ఊరట కలగనుందన్నారు.

ప్రేమ పేరుతో మోసగించి.. వ్యభిచార వృత్తిలోకి దింపి..

- పెద్దాపురంలో బాలికకు నరకం చూపించిన తల్లీకొడుకు
- అచేతన స్థితికి చేరుకున్న బాధితురాలు
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

పెద్దాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలికకు ప్రేమ పేరుతో వల వేసి ఆపై పెళ్లి పేరుతో మోసగించి వ్యభిచార వృత్తిలోకి దింపి నరకం చూపించారు ఓ తల్లికొడుకు. దీంతో బాలిక ఆచేతన స్థితికి వెళ్లింది. ఈ ఘటన కాకినాడ జిల్లా పెద్దాపురంలో వెలుగుచూసింది. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అసలేం జరిగిందంటే..

స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన చందు అనే యువకుడు అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ 17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి ఆపై పెళ్లి పేరుతో వంచించి పెద్దాపురం తీసుకు వచ్చాడు. కొన్నిరోజులు గడిచాక తల్లీ నీలిమ, కొడుకు చందూ డబ్బుపై ఆశతో బాలికకు తమ విశ్వరూపాన్ని చూపించారు. వ్యభిచారం చేయాలంటూ వేధించడం ప్రారంభించి నిత్యం బాలికకు నరకం చూపించారు. బలవంతంగా బాలికతో వ్యభిచారం చేయించారు. దీంతో బాలిక అనారోగ్యం పాలయ్యింది. అలాగే కొన్ని రోజులకు ఆమె శరీరంలో ఇన్‌ఫెక్షన్ రావడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీతో చికిత్స చేయించారు. బాలికకు రకరకాల మందులను వాడించి నానాహింసలకు గురి చేశారు. తల్లీ కొడుకులు పెట్టే బాధలు తాళ లేక గతేడాది డిసెంబరు 28న చీమల మందు తాగి బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే బాలికకు చేతులు, కాళ్లు వంకర్లు పోయి కదలేక అచేతనంగా ఉండిపోయింది. కాకినాడ చేరుకున్న బాలిక తల్లి దండ్రులు విశాఖ విమ్స్‌కు తీసుకు వెళ్లి చికిత్స అందించారు. బాలిక మానసిక స్థితి కూడా తేడా రావడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులైన తల్లీకొడుకుపై కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసిన నిందితులు పరారీ కావడంతో పోలీసులు ముమ్మంగా గాలించి అరెస్ట్ చేశారు.

పోక్సో కేసు నమోదు

మైనర్ బాలికతో నిర్బంధ వ్యభిచారం చేయించిన కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు వెల్లడించారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుమారు 6 నెలల క్రితం బాధిత మైనర్ బాలికకు పెద్దాపురానికి చెందిన ధరణికోట చందు అనే యువకుడితో ప్రేమ వివాహం జరిగిందన్నారు. బాలికను ఆమె అత్తగారు వ్యభిచారం చేయమని ప్రోత్సహించినట్టు, డ్రగ్స్ ఇచ్చి ఇబ్బంది పెట్టినట్టు పోలీసులకు తెలియచేయలేదన్నారు. ఈనెల 25న పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు వైజాగ్ విమ్స్ ఆసుపత్రి నుంచి వచ్చిన బాధిత బాలిక తల్లి వచ్చి ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఈనెల 26న కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే నిందితుడు చందుపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉందని, మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు. ఈ కేసు విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని తెలిపారు. సమావేశంలో సీఐ ఏ.కృష్ణ భగవాన్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీ

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- కాకినాడలో ఏపీ హోటల్స్ అసోసియేషన్ సమావేశం



కాకినాడలో లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీని తీసుకొచ్చి అమలు చేయనున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కాకినాడలో స్థానిక వెంకీ రెసిడెన్సీ హోటల్‌లో బుధవారం రాత్రి ఏపీ హోటల్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. 26 జిల్లాల నుంచి పలు హోటళ్ల యజమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టూరిజం శాఖకు ఇండస్ట్రీ హోదా ఇస్తున్నామన్నారు. పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ ఇస్తామని హామీ ఇచ్చారు. హోటల్ ఇండస్ట్రీస్ పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. టూరిజం అభివృద్ధి చెందాలంటే హోటల్ ఇండస్ట్రీని ముందుకు తీసుకువెళ్లాలని, ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం పరిష్కారం చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆలోచనతో టూరిజం అభివృద్ధికి సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. ఏపీలో సింగిల్ విండో విధానంలో టూరిజం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ప్రత్యేకమైన టూరిజం పాలసీ ద్వారా రిసార్ట్స్, హోటల్స్ ఇతర నిర్మాణాలు, వివిధ విభాగాలను అభివృద్ధి చేస్తామన్నారు. టెంపుల్ టూరిజం కూడా అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకుల సందర్శనలో వారికి సౌకర్యాలు కల్పించడంలో హోటళ్ల పాత్ర చాలా కీలకంగా ఉందని మంత్రి తెలిపారు.

హోటళ్లకు విద్యుత్ రాయితీలు

పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ టూరిజాన్ని ఒక పరిశ్రమగా తీసుకుని వస్తున్నామని, హోటళ్లకు విద్యుత్ రాయితీలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే హోటళ్లకు రాయితీలు ఇచ్చేలా టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మంచి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. టూరిజం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయనుందన్నారు. పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తామన్నారు. హోటళ్లలో సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి మాటాడుతూ టూరిజంశాఖ ద్వారా హోటళ్ల నిర్వహణకు అవసరమైన తోడ్పాటును అందజేయాలని మంత్రిని కోరారు. టూరిజం డెవలప్మెంట్ కమిటీలో హోటల్ మేనేజ్మెంట్‌ను కూడా చేర్చాలని, లైసెన్స్ ఫీజులను రద్దు చేయాలని కోరారు.

కౌడా నుంచి పూర్తి సహకారం

కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ టూరిజంపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టితో ఉన్నారన్నారు. రాష్ట్ర పర్యటక రంగాన్ని, హోటల్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కౌడా నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. హోటల్ మెనేజ్మెంట్ రంగానికి సహకారం అందిస్తామన్నారు. ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్(టీడీసీ) చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఏపీలో టూరిజం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోందన్నారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు, సంపద సృష్టికి టూరిజం పాలసీని కూడా తీసుకొచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకీ రెసిడెన్సీ ఎండీ మూర్తి, హోటళ్ల యజమానుల అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

సముద్ర స్నానం చేస్తూ వ్యక్తి మృతి



మృతిచెందిన వెంకటసుబ్బారావు

అల్లవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చొల్లంగి అమావాస్య సందర్భంగా సముద్ర జలాల్లో పుణ్యస్నానాలు చేస్తూ వ్యక్తి మృతి చెందిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలో బుధవారం ఉదయం జరిగింది. అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామానికి చెందిన బొడ్డు వెంకటసుబ్బారావు (45) ఎస్.రామేశ్వరంలో సముద్ర స్నానానికి దిగి పెద్ద అలకు కొట్టుకుపోయి మృతిచెందాడు. అన్నను రక్షించే ప్రయత్నంలో బొడ్డు రమేష్ సముద్రంలో మునిగిపోతుండగా స్థానికులు దిగి రమేష్‌ను ఒడ్డుకు చేర్చారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు రామేశ్వరం వచ్చిన అన్నదమ్ములిద్దరూ 8 గంటల ప్రాంతంలో ఎవరూలేని చోట స్నానానికి దిగగా పెద్ద కెరటానికి కొట్టుకుపోయి అన్న వెంకటసుబ్బారావు మృతిచెందగా తమ్ముడు రమేష్‌ను స్థానికులు రక్షించారని పోలీసులు తెలిపారు. వెంకటసుబ్బారావు నేదునూరులో పాన్‌షాపు నడుపుతున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్‌లు ప్రమాద స్థలిని సందర్శించారు. వెంకట సుబ్బారావు మృతదేహానికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వాకింగ్‌కు వెళ్లి.. శవమై కనిపించి..!

పందలపాకలో వివాహిత అనుమానాస్పద మృతి



లలితేశ్వరి మృతదేహం

బిక్కవోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాకలో ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. కురుపూడి లలితేశ్వరి (33) స్థానిక సంచుల గొడౌన్లో గుమస్తాగా పనిచేస్తోంది. రోజువారీ దినచర్యలో భాగంగా బుధవారం తెల్లవారుజామున వాకింగ్‌కు బయటకు వెళ్లింది. అయితే ఎంతసేపైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త రాజు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బంధువులకు సమాచారమిచ్చాడు. వారంతా వచ్చి వెతకగా ఆమె పనిచేస్తున్న సంచుల గొడౌన్లో శవమై కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ముఖంపై గాయాలు, రక్తపు మరకలు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్ఐ వీ.రవిచంద్ర కుమార్ తెలిపారు. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించ గా, అవి సంఘటనా స్థలం నుంచి గ్రామంలోని జెండా పంజా సెంటర్ వరకు వచ్చి ఆగిపోయాయి. ఈస్ట్‌జోన్ డీఎస్పీ బీ.విద్య, అనపర్తి సీఐ సుమంత్ వచ్చి పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంజాయి సేవిస్తున్న ఆరుగురి అరెస్టు

600 గ్రాముల గంజాయితో పాటు మోటారుసైకిళ్లు స్వాధీనం

అమలాపురం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సావరం బైపాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారాన్ని పట్టణ సీఐ పి.వీరబాబు అందుకున్నారు. వెంటనే పట్టణ ఎస్ఐ టి.తిరుమలరావు ఆధ్వర్యంలో సిబ్బంది సావరం బైపాస్ రోడ్డులో తనిఖీలు నిర్వహించగా ఆరుగురు యువకులు గంజాయి సేవిస్తున్నట్టు గుర్తించారు. అమలాపురం ఇన్‌చార్జి తహశీల్దార్ వాసా ఎస్.దివాకర్ సమక్షంలో ఫ్రెంచి యానానికి చెందిన కనపర్తి వెంకటదుర్గ అలియాస్ దుర్గ, పెద్దిరెడ్డి గోవింద రాజులు, సాపే వంశీ, కర్రి దుర్గాప్రసాద్, అమలాపురం రూరల్ మండలం చిందాడగరువుకు చెందిన బొంతు నవీన్‌కుమార్, నల్లమిల్లికి చెందిన కోటిపల్లి నవీన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి, నాలుగు మోటారుసైకిళ్లు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసినవారిని అమలాపురం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. గంజాయి రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వీరబాబు తెలిపారు.

నేటి నుంచి కాకినాడ ఐటీఐలో బ్రిడ్జి కోర్సు ప్రారంభం

కన్వీనర్ వేణుగోపాల వర్మ

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్ డిప్లమోలో నేరుగా రెండో సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు సిద్ధం చేయడానికి బ్రిడ్జి కోర్స్ తరగతులు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల జిల్లాల కన్వీనర్ ఎం వేణుగోపాల వర్మ తెలిపారు. ఈ నెల 30 నుంచి ఈ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పదవ తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన ధృవీకరణ పత్రాల జెరాక్స్ కాపీలను తీసుకుని నేరుగా కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో సంప్రదించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 87907 98431, 94946 88516లలో సంప్రదించాలన్నారు.

5 నుంచి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు జరగనున్నాయి. 9వ తేదీ వరకూ జరిగే నాటికల పోటీలకు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వివిధ నాటక సమాజాల కళాకారులు వచ్చి నాటికలు ప్రదర్శిస్తారని కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు చిగురు మేఘం నాటిక, విశాఖపట్టణం తెలుగు కళాసమితి కళాకారులు నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక, 6వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి అరవిందా ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు జనరల్ బోగీలు, 7వ తేదీన హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు మూల్యం నాటిక, కట్రపాడు ఉషోదయ నికేతన్ కళాకారులు కిడ్నాప్ నాటిక, 9వ తేదీన పొన్నూరు రసఝరి కళాకారులు గురితప్పిన వేట నాటికలను ప్రదర్శిస్తారు. విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు



వాకాడలో విచారణ చేపడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు, సీడీపీవో

కరప, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఉత్తర్వులు జారీచేశారు. బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి డీఈవో, ఎంఈవోలకు ఫోన్ చేసి విచారణ చేపట్టి వెంటనే అతన్ని విధుల నుంచి తొలగించాలని సూచించారు. దీంతో ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ వాకాడలోని ఎంపీపీ స్కూల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. వారిచ్చిన ప్రాథమిక నివేదికను అనుసరించి లైంగిక వేధింపులకు పాల్పడిన వీఎస్.రామారావును సస్పెండ్ చేస్తూ డీఈవో ఆదేశాలు జారీచేశారు. అలాగే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ కాకినాడ ప్రాజెక్టు సీడీపీవో యాసరపు లక్ష్మి బుధవారం సాయంత్రం వాకాడ ఎంపీపీ పాఠశాలకు వెళ్లి బాధిత బాలికతో బాటు సహచర విద్యార్థినులు, వారి తల్లులను విచారించారు. ఉపాధ్యాయుడు రామారావు చేసిన అకృత్యాలు, వికృత చేష్టలను బాధిత బాలికతో బాటు మరో నలుగురు బాలికలు పూసగుచ్చినట్టు చెప్పారు. బాలికలు, వారి తల్లులు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా రూపొందించిన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే పంతం నానాజీ లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు అండగా ఉండి పూర్తి న్యాయంజరిగేలా చూస్తామని తెలిపారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌గా ముద్రగడ నాగేంద్రకుమార్



సర్పవరం జంక్షన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ముద్రగడ నాగేంద్రకుమార్‌ను ప్రభుత్వం నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమాండెంట్‌గా ఉన్న ఐపీఎస్ ఎం దీపిక బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఆక్టోపస్ కమాండెంట్‌గా పనిచేస్తున్న నాగేంద్రకుమార్‌ను ఏపీఎస్పీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో ఇక్కడ అదనపు కమాండెంట్‌గా పనిచేశారు.

'ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలి'

సామర్లకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంపొందించేందుకు శిక్షణా తరగతులను పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల మండలాలకు చెందిన రెండవ బ్యాచ్ పంచాయతీ కార్యదర్శులకు ఈటీసీ ఆవరణలో అందిస్తున్న రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 5 జిల్లాలకు చెంది ఆయా పంచాయతీ కార్యదర్శులు సుమారు 67 మంది హాజరయ్యారు. ఫిబ్రవరి 8 వరకూ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరెక్టర్ రామనాథం, ఫ్యాకల్టీలు తదితరులు ఉన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కొండచిలువలు వచ్చాయి!

మల్లేపల్లి జాతీయ రహదారిపై హల్‌చల్

గండేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి కొండ చిలువ హల్‌చల్ చేసింది. జాతీయ రహదారి దాటేందుకు రోడ్డు మధ్యలోకి రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. అటుగా వెళుతున్న వాహనాలు దానిపై నుంచి వెళ్లడంతో చనిపోయింది. దాని పొడవు సుమారు ఆరున్నర అడుగులు ఉంటుందని స్థానికులు తెలిపారు. అయితే గతంలో ఇదేచోట హైవే పక్కన వరి పొలంలో ఏడున్నర అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు.



గండేపల్లి జాతీయ రహదారిపై చనిపోయిన కొండచిలువ

గిడజాంలో..

రౌతులపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 అడుగుల కొండచిలువను గ్రామస్థులు చంపేశారు. బుదవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పిల్లలు కొబ్బరి మొక్కలకు నీళ్ల పోస్తుండగా బాత్ రూమ్ వద్ద కొండచిలువ ఉండ డంతో ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు గ్రామస్థులు దృష్టికి తీసుకెళ్లగా కొండచిలువను హతమార్చారు. అయితే పాఠశాల పైనే కొండ ఉండడంతో కొండ చిలువ వచ్చి ఉంటుందని గ్రామస్థులు భావిస్తున్నారు.



గిడజాంలో హతమార్చిన కొండచిలువ

ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్ట్ మృతదేహం కాలువలో లభ్యం





సలీం మృతదేహం, ఫైల్ ఫొటో

సామర్లకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న పెదపూడికి చెందిన జర్నలిస్టు షేక్ సలీం(40) మృతదేహం 20 రోజుల అనంతరం సామర్లకోట కాలువలో లాకులు సమీపంలో తూటికాడ డెక్కలలో చిక్కుకుని ఉండడాన్ని బుధవారం సాయంత్రం సామర్లకోట పోలీసులు గుర్తించారు. దుస్తుల ఆధారంగా సలీం మృతదేహంగా పోలీసులు గుర్తించి పెదపూడిలో ఉన్న సలీం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నెల 9న సాయంత్రం సామర్లకోట రైల్వే గేటు సమీపంలో ఉన్న నూతన వంతెన పైనుంచి కాలువలోకి సలీందూకి ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు గజ ఈతగాళ్లతో చేపట్టినా ఫలితం లేకపోయింది. బుధవారం సలీం మృతదేహన్ని పోలీసులు గుర్తించి గట్టుకు చేర్చారు. సుమారు 20 రోజులు పాటు నీటిఅడుగు భాగంలోనే మృతదేహం ఉండిపోవడంతో గుర్తుపట్టలేని రీతిలో డీకంపోజ్ అయ్యిందని అక్కడే పోస్టుమార్టం పూర్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కృష్ణభగవాన్ తెలిపారు.

కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

అనపర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరులో ఈనెల 14వ తేదీన స్కూటీపై వెళుతున్న మహిళను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఆమె రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసు పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుపై అనపర్తి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన కర్రి అలేఖ్య ఈనెల 14న స్కూటీపై రామవరం నుంచి అనపర్తి వెళ్తుండగా పొలమూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. దవడ, ఎడమ చేతి ఎముకలు విరిగిపోయాయి. స్థానికుల సహకారంతో ఆమెను అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు రాజమహేంద్రవరం తరలించారు. స్కూటీని ఢీకొన్న వాహనం వివరాలు తెలియరాలేదు. అలేఖ్య భర్త పేర్రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురంలో పురూలియా చౌ

పిఠాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కళ్లెదుటే సన్నివేశాలు జరుగుతున్నట్లు నృత్యాభియం, కళ్లప్పగించి చూసేలా కదలికలతో పురూలియా చౌ నృత్యప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. కాకినాడ జిల్లా పిఠాపురం పాత బస్టాండు వద్ద గల సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో పీఠికాపుర కళావేదికపై బుధవారం రాత్రి పశ్చిమబెంగాల్ సంప్రదాయ నృత్యకళారూపకం పురూలియా చౌ నృత్య ప్రదర్శన నిర్వహించారు. పురాణాల నుంచి వచ్చిన సన్నివేశాలను తీసుకుని మహిషాసుర మర్దిని, అభిమన్యు వధలను ప్రదర్శించారు. గౌర్‌కుమార్, విశాల్ చంద్రకుమార్, గణేష్ చంద్రకుమార్, స్వపన్ మహతో, పీలే మాచౌర్, రోహిన్, అక్షయ్, ఠాకూర్ దాస్‌కుమార్, హర్షభర్థన్ కుమార్, రంపాడ కలిండి, లొడ్డో మ్యూరింగ్, రాజారామ్ ఓరస్, అర్జున్ మాచౌర్ తదితర కళాకారులు ప్రదర్శన ఇచ్చారు.



పిఠాపురంలో నిర్వహించిన పురూలియా చౌ నృత్య ప్రదర్శన దృశ్యాలు

సూరీడు.. సూపర్!





కాకినాడలో బుధవారం సూర్యుడు ఉదయిస్తున్న సమయంలో ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిన దృశ్యాలు

ఫొటోగ్రాఫర్, కాకినాడ

కాకినాడ

మా సమస్యలివి..

పరిష్కారం చూపండి!



- పిఠాపురం 18వ వార్డులో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదిక వద్ద ప్రజల వినతుల వెల్లువ

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే ఎజెండాగా' పేరుతో మంగళవారం పిఠాపురం 18వ వార్డులో కుంతీమాధవ స్వామి ఆలయంవద్ద నిర్వహించిన చర్చా వేదిక విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. అధికసంఖ్యలో వచ్చిన వార్డు ప్రజలు ఎన్నో సామాజిక సమస్యలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నేత సూరవరపు సురేష్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, మున్సిపల్ కమిషనర్ కనకారావు దృష్టికి తీసుకువచ్చారు. వారు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. బుధవారం నాటి సంచికలో అనేక అభిప్రాయాలు ప్రచురించగా, చర్చా వేదికలో మరికొందరు వ్యక్తం చేసిన జనాభిప్రాయాలివి..

దుర్గంధపూరిత వాతావరణంతో ఇక్కట్లు

-దాసరి రామారావు, తిమ్మరాజు వీధి



డాక్టర్ ఆవంత్స సోమసుందర్ ఇంటివద్ద, నివాసముండని ఇళ్ల ప్రాంతాల వద్ద చెత్తాచెదారాన్ని తెచ్చి వేస్తున్నారు. దీనివల్ల ఈ ప్రాంతాలన్నీ దుర్గంధపూరితంగా మారుతున్నాయి. అక్కడ నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇంటింటి చెత్తసేకరణ సక్రమంగా జరగడం లేదు.

కరెంటు ఆఫీసు సిబ్బంది స్పందించడంలేదు

-పువ్వుల వీర మాధవ కృష్ణారావు, సామర్లకోట రోడ్డు



పిఠాపురంలోని కరెంటు ఆఫీసు ఫోన్ నెంబరు పనిచేయడం లేదు. పనిచేసినా అక్కడి సిబ్బంది ఫోన్ ఎత్తడం లేదు. దీంతో ఏదైనా సమస్య ఉంటే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కరెంటు ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వస్తోంది. జగ్గయ్యచెరువు కాలనీలో తరచూ కరెంటు పోతోంది.

స్థలాలు ఇస్తున్నామని కాగితాలు ఇచ్చారు

-కోన రమణమ్మ, కృష్ణుడి గుడివద్ద



ఇళ్లస్థలాలు ఇస్తున్నామని చెప్పి రెండున్నరేళ్ల క్రితం పట్టా కాగితాలు ఇచ్చారు. అప్పటినుంచి స్థలాలు ఎక్కడున్నాయో మాత్రం చెప్పలేదు. ఇది ఇస్తాం అని చెప్పడం తప్ప ఇప్పటివరకూ ఇవ్వలేదు. దీంతో అద్దెఇళ్లల్లో ఉంటున్న మేము అనేక ఇబ్బందులు పడుతున్నాం.

భర్త మరణించినా పింఛన్ రాలేదు

-గుర్రాల కుమారి, కత్తులగూడెం



నా భర్త మరణించి ఏడాది దాటింది. ఇప్పటివరకూ వితంతు పింఛన్ ఇవ్వలేదు. జీవనం సాగించడం ఇబ్బందికరంగా ఉంది. ఇళ్లలో పనిచేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నాను. నాకు ఎందుకు పెన్షన్ ఇవ్వడం లేదో తెలియడం లేదు.

చదువులకు ఆర్థికసహాయం చేయండి

-సాకా సావిత్రి, కాకినాడ రోడ్డు



నా అల్లుడు విజయకృష్ణ నా కూతురు లక్ష్మీ, మనుమరాళ్లు మానస, శివానీలను వదిలి వెళ్లిపోయాడు. దీంతో బెంగపెట్టుకుని నా కూతురు మరణించింది. దీంతో మనుమరాళ్ల బాధ్యత నాపై పడింది. వారి చదువుకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నాను.

రోడ్లు, డ్రైన్లు లేక ఇబ్బందులు పడుతున్నాం

-అడబాల లక్ష్మీ, పాతగొల్లవీధి



రోడ్లు, డ్రైన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్ల వద్ద మురుగు నీరు నిలిచిపోతోంది. వర్షాకాలం వస్తే మా ప్రాంతమంతా దుర్గంధపూరితంగా మారి అక్కడ ఉండలేకపోతున్నాం. రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు డ్రైన్ నిర్మించి మా ఇబ్బందులు పరిష్కరించాలి.

మురుగునీటిలో తాగునీటి పైపులైన్లు

-గుత్తుల రామకృష్ణ, గుట్ల వీధి



మా వీధిలో మురుగునీటి కాలువలో తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. దీనివల్ల కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోంది. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరాం. ఇప్పటికైనా స్పందించాలి.

డ్రెయిన్లల్లో పూడికలు తీయడం లేదు

-కొర్రా శివలక్ష్మి, బారువారి వీధి



పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. డ్రైన్లల్లో పూడికలను రోజుల తరబడి తీయడంలేదు. దీనివల్ల దోమలు పెరిగిపోయాయి. వీధుల్లో చెత్తసేకరణకు రిక్షాలు, ఆటోలు ఏర్పాటు చేయాలి. ప్రతిరోజూ డ్రైన్లలో పూడికలు తొలగించాలి.

చిన్న సమస్యలే పెద్దవయ్యాయి

-పంపనబోయిన అన్నపూర్ణ, కౌన్సిలర్, 18వ వార్డు



మా వార్డులో ఉన్న చిన్న చిన్న సమస్యలను దీర్ఘకాలంగా పరిష్కరించకపోవడంతో అవి పెద్దవి అయ్యాయి. తాగునీటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. కుళాయిలు లేనిప్రాంతాలకు పైపులైన్లు ఏర్పాటుచేయాలి. కుంతీమాధవస్వామి కోనేరు ఆధునికీకరణకు నిధులను రప్పించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

ఇబ్బందికరంగా ఉన్న స్పీడుబ్రేకర్లు తొలగించాలి

-ఈగల త్రిమూర్తులు, మానవహక్కుల కౌన్సిల్ డిఫెండర్



పాతయాదవ వీధి, హనుమంతరాయ కళాశాల ఎదురు వీధిలో అనధికారికంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ స్పీడు బ్రేకర్లను తక్షణం తొలగించాలి.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

ఎస్పీ బిందుమాధవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ

కాకినాడ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్యడిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం కళాశాల డీఎఫ్ఏపీ ఆధ్వర్యంలో కాకినాడ పోలీస్ శాఖ సైబర్ సెక్యూరిటీ, మాదక ద్రవ్యాల వ్యతిరేకతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని, హెల్మెట్ ఆవశ్యకత, ర్యాష్ డ్రైవింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎప్పుడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత సోషల్ మీడియా యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసగాళ్ల ట్రాప్‌లో పడొద్దని సూచించారు. కార్యక్రమానికి ఆదిత్య కళాశాలల కార్యదర్శి ఎస్.సుగుణ అధ్యక్షత వహించగా అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, సీఐ ఎం.అప్పలనాయుడు, ట్రాఫిక్ సీఐలు రామారావు, రమేష్, ఎస్ఎస్ఎస్ అధికారి తేజేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏఎస్పీ



కాకినాడ సిటీ, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): జిల్లా ఏఎస్పీగా నియమితులైన పాటిల్ దేవరాజ్ మనీష్ బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలోని పలుఅంశాలపై చర్చించారు.

'సహకార' ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

కాకినాడ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని, ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం అంతా సహకార శాఖ ద్వారా సహకార అభివృద్ధి, సహకార సంఘాలకు కలిగే ప్రయోజనాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన వ్యవసాయ అనుబంధ రంగాలు, జిల్లా సహకార బ్యాంకు, మార్కెటింగ్, పౌరసరఫరాలు, నాబార్డ్ తదితర శాఖల అధికారులతో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో 72 ప్రాథమిక సహకార సంఘాలకు గాను ఇప్పటి వరకు 65 ప్రాథమిక సహకార సంఘాల వివరాలు కంప్యూటరీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ప్రాథమిక సంఘాల కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. డీసీవో జి.వెంకటకృష్ణ, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, మత్స్యశాఖ జేడీ కె.కరుణాకర రావు, జిల్లా సహకార బ్యాంకు సీఈవో నరసింహారావు, నాబార్డ్ ఏజీఎం వై.సోమనాయుడు, డీఎస్‌వో లక్ష్మీప్రసన్న దేవి, మార్కెటింగ్ డీఈ వెంకటరాజారావు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులతో సాగునీటి సరఫరాకు ఆటంకం

500 ఎకరాల్లో పంటలు ఎండిపోతాయని రైతుల ఆందోళన

గొల్లప్రోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు శివారులోని జగనన్న కాలనీ వద్ద సుద్దగడ్డ కాలువపై బ్రిడి నిర్మాణ పనుల కారణంగా సాగునీటి సరఫరాకు ఆటంకం కలిగి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు, సుద్దగడ్డకు వరదలు సంభవించిన సమయంలో జగనన్న కాలనీకి రాకపోకలు నిలిచిపోయి అక్కడ నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రూ.4 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పనులు ప్రారంభమయ్యాయి. కాలువలో నీరు ప్రవహిస్తుండటంతో ప్రత్యామ్నాయంగా రోడ్డు నిర్మించి నీరు పోయేందుకు వీలుగా తూర ఏర్పాటు చేశారు. అయితే తూర ద్వారా నీరు అంతంతమాత్రంగానే వస్తుండటంతో సుద్దగడ్డ కాలువ ద్వారా వచ్చే నీటిపై ఆధారపడి వరి, కాయగూరలు, అపరాలు ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 500 ఎకరాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు. దీనిపై బుధవారం గొల్లప్రోలు తహశీల్దార్ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ డీఈఈ నరసయ్య పరిశీలన చేశారు. సాగునీరు పూర్తిస్థాయిలో అందేలా 2లేదా 3తూరలు ఏర్పాటు చేయాలని, లేకుంటే రాయవరం చెరువు ద్వారా నీటిని సరఫరా చేయాలని రైతులు కోరగా దీనిపై తహశీల్దార్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు.

తెలుగు చిత్రసీమకే వన్నెతెచ్చిన నటి అంజలీదేవి



అంజలీదేవి విగ్రహానికి నివాళి దృశ్యం

పెద్దాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు చిత్ర పరిశ్రమకే వన్నె తెచ్చిన గొప్ప నటి అంజలీదేవి అని పలువురు వక్తలు అన్నారు. అంజలీదేవీ ఫౌండేషన్ కన్వీనర్ పొలమరశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో స్థానిక పాత బస్‌స్టాండ్ సమీపంలో బుధవారం నిర్వహించిన అంజలీదేవి వర్ధంతి సభ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ముందుగా అంజలీదేవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంజలీదేవి పెద్దాపురంలో జన్మించడం చాలా గొప్ప విషయమన్నారు. పుట్టిన ఊరుకే కాకుండా యావత్ భారతదేశానికే పేరుప్రఖ్యాతులు తీసుకువచ్చిన గొప్పనటి అని ఆమె సేవలను కొనియాడారు. పెద్దాపురం ఆడపడుచుగా, కలియుగ అభినవ సీతగా ఖ్యాతి గాంచడంతోపాటు తెలుగుతెర సువర్ణ సుందరిగా అందరి మన్ననలు అందుకున్న మహోన్నతమైన నటి అని కొనియాడారు. సూరిబాబురాజు, ఖండవిల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆకతాయి చేష్టలకు పాల్పడితే చర్యలు'

గొల్లప్రోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బస్టాపులు, పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయి చేష్టలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. గొల్లప్రోలు పట్టణంలోని బస్టాండు, ఇతర ప్రాంతాల్లో బుధవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అత్యవసర సమాచారం, సహాయం అవసరమైతే గొల్లప్రోలు ఎస్ఐ 9440900758, పోలీసుస్టేషన్ 9154880095లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ఫోన్ నెంబర్లతో కూడిన పోస్టర్లను ప్రధానప్రాంతాల్లో అంటించారు.

'రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలం'

సామర్లకోట, జనవరి 29: (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెంలో గత నెల డిసెంబరులో జరిగిన మూడు హత్యల నేపథ్యంలో పోలీసుల దర్యాప్తులపై తమకు న్యాయం జరగడం లేదని, ప్రభుత్వం సైతం తమను ఏవిధంగానూ పరామర్శించకపోగా ఆర్థికపరంగా ఆదుకోలేదని కార్థాల లక్ష్మి తదితర బాధిత కుటుంబాలు అమరావతిలో టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదులు చేయడంతో జిల్లా ఎస్పీ కార్యాలయ అధికారులు బుధవారం నాటి సంఘటనలో దర్యాప్తు ఎంతమేర అనే అంశంపై ఆరా తీశారు. పోలీసులు నేటి వరకూ తమ కుటుంబాలకు ఎటువంటి న్యాయం చేయకపోగా తమకు కనీస రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు స్పార్క్ ఓరియంటేషన్



వీసీ మురళీకృష్ణ, ఎం.కోటతో విద్యార్థులు, ప్రొఫెసర్లు

జేఎన్టీయూకే, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో సుబుకోట ఫౌండేషన్, క్రాస్ బోర్డర్స్ సహకారంతో యూనివర్సిటీలోని విద్యార్థులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా బీటెక్ ప్రథమ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు స్పార్క్ ఓరియంటేషన్-2 ప్రోగ్రాంను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, గౌరవఅతిథిగా సుబు కోట ఫౌండేషన్ చైర్మన్ సుబు ఎం.కోట పాల్గొన్నారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ సుబు కోట ఫౌండేషన్ ద్వారా వర్సిటీలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్ క్యాంప్స్, పరిశ్రమల సందర్శన, ఎకో సిస్టం సందర్శన, ఎంపిక చేసిన విద్యార్థుల ఆలోచనలను ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేయడానికి ఆర్థిక సహకారం అందించి వారి కలలను సాకారం చేస్తామన్నారు. సుబు ఎం.కోట మాట్లాడుతూ వ్యవస్థాపకత అనేది విద్యార్థులు భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు సవాళ్లతో కూడిన లక్ష్య ఛేదన అన్నారు. ఓరియంటేషన్-2లో విద్యార్థి బృందాలకు ఓపెన్ ప్యానెల్ చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తామని, మూడు వినూత్న ప్రాజెక్టులను ఎంపిక చేస్తామని తెలిపారు.

రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

బీజేపీ నేత డాక్టర్ చిన్నయ్యదొర

పెద్దాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరూ గౌరవించాలని సంవిధాన్ గౌరవ్ అభియాన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గౌరకపూడి చిన్నయ్యదొర అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంపై మరింతగా గౌరవాన్ని పెంపొందించాలన్నారు. ఈసందర్భంగా అంబేడ్కర్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కొక్కిలగడ్డ గంగరాజు, పుప్పాల నాగ గోవిందు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పురందరదాసు ఆరాధనోత్సవాలు

సామర్లకోట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు ఆరాధనోత్సవాలు సామర్లకోట వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆల యంలో బుధవారం ఘనంగా నిర్వహిం చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ భజనమండలి, సత్యనారాయణ మూర్తి భజనమండలి, మాండవ్యనారాయణ స్వామి పారాయణ భజన మండలి, లక్ష్మీగణపతి కోలాట భజన మండలి తదితర భజనమండళ్ల సభ్యులు హాజరై పురందరదాసు చిత్రపటానికి పూలమాలు వేసి పూజలు చేశారు. అనంతరం సామూహిక భజలు చేసి పురందరదాసు కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో కాపుగంటి పైడిరత్నం, కటకం హైమావతి, కటకం రత్నకుమారి, భవాని, ఊరా నాగమణి, కంచర్ల భాగ్యలక్ష్మి, మోహన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేనేత సామాజిక వర్గాలకు సహకారం అందిస్తాం



ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చేనేత సామాజిక వర్గాలకు పూర్తి సహకారం అందిస్తామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ -2025 క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే కొండబాబు ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పప్పు దుర్గారమేష్, చేనేత సంఘాల ప్రతినిధులు ఆధ్వర్యం వహించారు. అనంతరం జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన దుర్గారమేష్‌ను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు కార్యక్రమంలో చేనేత సంఘాల ప్రతినిధులు ఇమ్మంది చంద్రరావు, నక్కిన విజయలక్ష్మి, గుడిమెట్ల వీర్రాజు, పోతాబత్తుల పవన్, పలివెల లక్ష్మీరాజ్, పంపన ప్రసాద్, నటరాజ్, పొన్నగంటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరణ



పోలీస్ డైరీని ఆవిష్కరిస్తున్న హెచ్‌పీసీ కమాండెంట్ రామకృష్ణ

సర్పవరం జంక్షన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని హెచ్‌పీసీ కమాండెంట్ సీపీఏ రామకృష్ణ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల విధులు, బాధ్యతలు, సంక్షేమం, అభివృద్ధి, జీవోలు ఈడైరీలో పొందుపరచడంతో పోలీసులకు ఎంతగానో ఉపయోడపతుందన్నారు. ఎన్నో వ్యయప్రయాసలు కోర్చి డైరీని తయారుచేసిన సంఘం ప్రతినిధులను అభినందించారు. అడిషనల్ కమాండెంట్ ఎస్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు బి.చంద్రశేఖర్, మన్మధరావు, ఆర్ఐలు రవిశంకర్, రాము, అజయ్‌కుమార్, ప్రసాద్, ట్రైనీ డీఎస్పీలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ



పిఠాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో డ్రగ్స్, ఈవ్‌టీజింగ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనరాలను వివరించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడి భవిష్యత్తును అంధ కారం చేసుకోవద్దని తెలిపారు. పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్, అడిషనల్ ఎస్ఐ జానీబాషా, కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావుపాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్: ఎస్ఐ

పిఠాపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపితే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని పిఠాపురం రూరల్ ఎస్ఐ గుణశేఖర్ హెచ్చరించారు. పిఠాపురం మండలం రాపర్తి రోడ్డులో బుధవారం ఆటోలు, మోటార్‌సైకిళ్లను ఆపి రికార్డులు పరిశీలించారు. నిబంధనలు పాటించని, డ్రైవింగ్‌లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాళ్లరేవు/యానాం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మెయిన్‌రోడ్డు నుంచి ప్రజాసంఘాల భవనాల వరకు రూ.4లక్షలతో మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. రోడ్డు నిర్మాణం పట్ల స్థానికులు హర్ష వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు రాయుడు గంగాధర్, మాజీ సర్పంచులు రెడ్డి రెడ్డిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, విశ్రాంతి ఉద్యోగులు సంఘ నాయకులు అత్తిలి బాబూరావు, కడలి ప్రకాశరావు, ఎలిపే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, ప్రతి ఓటరును స్వయంగా కలవడంతో పాటు వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. ఓటరుకు పార్టీ పంపిన కరపత్రాలు అందజేసి కూటమి అభ్యర్థికి అండగా నిలవాలని కోరాలన్నారు. సమావేశంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, బూత్ కన్వీనర్ బర్ల అప్పన్న, ఎలుబండి బాబులు పాల్గొన్నారు.

మినీ గూడ్స్ యూనియన్ ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న పాత సభ్యుడు రేకాడి నాగబాబుకు దికాకినాడ మినీ గూడ్స్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ద్వారా నగదు, సరుకుల రూపేణా రూ.12వేలు సాయం అందజేశారు. బుధవారం యూనియన్ గౌరవాధ్యక్షుడు గదుల సాయిబాబు, అధ్యక్షుడు ఎలుగుబంటి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి చాట్ల గురుమూర్తి తదితరులు బాధితుడి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సాయం అందించారు.

ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

కాకినాడ ఆర్టీవో శివారెడ్డి

పెద్దాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు నడిపే ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, రహదారుల భద్రతా నియమాలు పాటించాలని కాకినాడ ఆర్టీవో శివారెడ్డి అన్నారు. హెల్మెట్ ధారణపై పెద్దాపురం ఎంవీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోటార్ బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ పట్టణంలో పలు వీధుల్లో సాగింది. ఎస్ఐ మౌనిక, ఏఎంవీఐ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'సామర్లకోట'లో రీసర్వే పనులు ముమ్మరం



వేట్లపాలెంలో రీసర్వే పనుల దృశ్యం

సామర్లకోట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు వేట్లపాలెంలో రీసర్వే పనులు నాలుగు రోజులుగా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి నేతృత్వంలో డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న రీసర్వే ద్వారా భూయజమానులకు శాశ్వత రక్షణ ఏర్పడుతుందని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో 4,873.3ఎకరాల విస్తీర్ణానికి రీసర్వే నిర్వహించేందుకు 24 రీసర్వే బృందాలను నియమించామన్నారు. ప్రతీ సర్వే బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, వీఆర్యేలు ఉంటారన్నారు. మూడు కమ్యూనికేషన్ బృందాలను నియమించగా వాటిలో వీఆర్వో, గ్రామ సర్వేయరు ఉంటారన్నారు. క్షేత్రస్థాయిలో రీసర్వే గ్రౌటింగ్ పనులను మంగళవారం ప్రారంభించగా 17,18 ఖండాలకు చెంది సర్వే నంబరు 664నుంచి 751 వరకు పెదపూడి రోడ్డులో రీసర్వే పనులు జోరుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామంలో రీసర్వే పనులకు సంబంధించి రైతులను చైతన్యవంతులను చేసేందుకు ఈనెల23న సంబంధిత ఖండాలకు చెందిన సర్వే నెంబర్ల రైతులకు నోటీసులు జారీ చేశామని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో సర్వే డీటీ వై.శ్రీనివాస్, కార్యాలయ సూపరింటెండెంట్ పద్మజ వీఆర్వోలు మామిడాల కామరాజు, కెవీవీ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలి'

రౌతులపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని జేసీ రాహుల్‌మీనా సిబ్బందికి సూచించారు. మండలంలోని వెంకటాపురం, రాజవరం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రాజవరంలో సచివాలయాన్ని సందర్శించారు. ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కారించాలని సూచించారు. నిర్మాణంలో నిలిచిపోయిన స్కూలు, ఇతర భవనాలను పరిశీలించి వెంటనే పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పరిహారం, పునరావాసం కల్పించకపోతే పోరు బాణాలవుతాం

• సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ పెనుబల్లి మధు హెచ్చరిక


చింతూరులో పోలవరం పోరు పతాక యాత్రను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ పెనుబల్లి మధు

చింతూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టు కట్టాలనుకుంటే గిరిజనులంతా పోరు బాణాలవుతారని సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ పెనుబల్లి మధు హెచ్చరించారు. చింతూరులో బుధవారం మధు పోలవరం పోరు పతాకయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నుంచి మొదలు జగన్ ప్రభుత్వంతోపాటు నేటి చంద్రబాబు ప్రభుత్వం వరకు నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం నిర్వాసితుల ఊసే ఎత్తడం లేదన్నారు. సీఎం చంద్రబాబు సోమవారం పోలవరం అంటారే గాని నిర్వాసిత సమస్య పరిష్కారం అన్న మాట అనకపోవడం గమనార్హమన్నారు. రాజశేఖరెడ్డి ప్రభుత్వం విలీన మండలాల్లో ఎకరాకు కేవలం రూ.1లక్ష 15వేలు ఇచ్చి మిన్నకుండన్నారు. ఇది చాలా దారుణమన్నారు. పోలవరంతో ముంపునకు గురయ్యే ప్రతి ఎకరా సాగు భూమికి రూ. 50లక్షల వంతున నష్ట పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయకుండా గ్రామాలు ఖాళీ చేయించాలన్న ప్రయత్నం మానుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్య మం తీవ్రతరం చేయడం ఖాయమన్నారు. కార్యక్రమానికి ఎర్రశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా సీపీఎం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు దడాల సుబ్బారావు, సున్నం రాజులు, మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, కారం లక్ష్మి, సీసం సురేష్, కొమరం పెంటయ్య, పల్లపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సభాపతి వ్యాఖ్యలు సరికాదు


చింతూరు ఐటీడీఏ ఎదుట సభాపతి వ్యాఖ్యలను నిరసిస్తున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

చింతూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ చట్టాలపట్ల సభాపతి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను తాము నిరసిస్తున్నామని, తక్షణమే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం నేతృత్వంలో చింతూరు ఐటీడీఏ ఎదుట తమ నిరసన వ్యక్తం చేశారు. ఐదవ షెడ్యూల్లో గిరిజన చట్టాలు ఆదివాసీల అభివృద్ధికి జీవనాడన్నారు. గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ పరిపాలన శాఖను ఏర్పాటు చేయాలన్నారు. మన్యంలో 1/70 చట్టం భూ బదలాయింపు నిషేధ చట్టం మాత్రమే కానీ అభివృద్ధికి అడ్డంకి కాదన్నారు. ఈ చట్టమే లేకుండా ఇప్పటికే ఆదివాసీలు అంతరించి పోయే వారని వెంకటేశ్వర్లు అన్నారు. చట్టంపై అవగాహన లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. ఒక ఉన్నత పదవిలో ఉండి ఆదివాసీ పరిరక్షణ చట్టంపై అవగాహన లేని వ్యాఖ్యలు సభాపతి చేయడమన్నది బాధ్యతారాహిత్యమన్నారు. ఈమేరకు కూటమి ప్రభుత్వం అయ్యన్నపాత్రుడుపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పూనెం చిన్నవీరభద్రం, సోడె రాఘవయ్య, సోడె ప్రసాద్, కారం వెంకటేశ్వర్లు, శీలం కృష్ణ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

రంపచోడవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరంపల్లిలో రైతులకు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పంట సాగులో ఎరువులు యాజమాన్యం, సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఫీల్డ్ అఫీసర్ కె.కార్తీక్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, బి.రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జీడిమామిడి ఆకులు తిని పశువుల మృతి


మృతి చెందిన ఆవు

చింతూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం, కొండపల్లి, పెద్దసీతనపల్లి గ్రామాలలో పశువులు మృతి చెందుతున్నాయని రైతులు వాపోతున్నారు. పశువుల మృతికి గల కారణం తమకు తెలియడం లేదన్నారు. కొండపల్లి, పెద్దసీతనపల్లి గ్రామాల్లోని నాలుగు కుటుంబాలకు చెందిన పది పశువులు మృతి చెందడంతో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. ఈవిషయమై పశు వైద్యాధికారి (చింతూరు ఇన్‌చార్జి) అన్వేష్‌ని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరింది. పశువులు రెండు రోజుల క్రితం సమీప ప్రాంతంలోని జీడిమామిడి తోటలో లేత ఆకులు తిన్నాయన్నారు. దీంతో ఆ ఆకులు విష పూరితంగా మారి పశువుల మృతికి కారణమైనట్లు తాము చేపట్టిన పోస్టుమార్టంలో వెల్లడైందన్నారు. ఆకులు తిని కడుపు ఉబ్బి బాధపడుతున్న పశువులను గుర్తించి వాటికి బుధవారం చికిత్స అందించామన్నారు. గురువారం ఆయా గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కేవలం రెండు పశువులే మృతి చెందినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు.

అంత్యక్రియల ఖర్చులకు సాయం అందజేత



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

ఎటపాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో అనారోగ్య కారణాలతో మరణించిన కుటుంబాల వారికి అంత్యక్రియల ఖర్చుల కోసం బుధవారం జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.12వేల ఆర్థిక సాయం అందజేశామన్నారు. గౌరిదేవిపేట గ్రామానికి దారా రాఘవులు, చింతా నరసమ్మ, సీతాపురం గ్రామానికి చెందిన గరాటా వీరయ్య, గోగుబాక గ్రామానికి చెందిన ఇసంపల్లి పెంటయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందారు. నాలుగు బాధిత కుటుంబాలకు జేకేసీటీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.3వేల చొప్పున అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, కణితి మధు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు మారాసు గంగాధర్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అపరాల సాగులో దిగుబడుల పెంపునకు సబ్సిడీపై పురుగు మందులు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్


ప్రత్తిపాడు మండలం బవురువాకలో అపరాల సాగు పొలాన్ని సందర్శిస్తున్న విజయకుమార్

ప్రత్తిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో అపరాల సాగు దిగుబడులు పెంచడానికి రైతులకు 50శాతం సబ్సిడీపై పురుగు మందులు సరఫరా చేయనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ చెప్పారు. మండలంలోని బవురువాకలో అపరాలు సాగు చేసిన సామూహిక ప్రదర్శన క్షేత్రాలను బుధవారం ఆయన సందర్శించారు. గ్రామంలో రైతులతో సమావేశమై అపరాల సాగు దిగుబడులు పెంపుదలకు వేపనూనె, మైక్రో న్యూటిన్, ఇతర పురుగు మందులను 50శాతం సబ్సిడీపై అందజేయనున్నట్టు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించే పంటలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉందన్నారు. బ్రాండింగ్ చేసుకుని అంతర్జాతీయ మార్కెట్లో కూడా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ప్రవేశించి అధిక ధరలు పొందవచ్చన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీపై పురుగు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు వైవీ గంగాధర్, సర్పంచ్ సత్యనారాయణ, ఏఈవో అర్జున్, వీఏఏలు ప్రకాష్, మణికంఠ, సాయి, రైతులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో రైతులకు మేలు

శంఖవరం (ఆంధ్రజ్యోతి): రైతులు బహుళ పంటలు సాగు చెయ్యడం ద్వారా ఆదాయం చేకూరడంతో పాటు భూసారం అభివృద్ధి చెందుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. కత్తిపూడి, సీతంపేట గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి పి.గాంధీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ విధానాలతో రైతులకు మేలు జరుగుతుందని, ప్రస్తుతం వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరిగిందని తెలిపారు. వ్యవసాయ పనిముట్లకు ఇచ్చే రాయితీలను వివరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రామలక్ష్మి, ప్రభాస్, చినబాబు, రైతులు పిల్లా అప్పారావు, సత్యనారాయణ, వీరబాబు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): మెట్టలో వాణిజ్య పంటగా సాగవుతున్న మామిడి పంట ఆశాజనకంగా మారేందుకు రైతులు మెళకువలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి అశోక్ కోరారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా బుధవారం ఆయన తేటగుంటలో మామిడి రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మామిడి పంటలో అనుసరించాల్సిన సస్యరక్షణ పద్ధతులను వివరించారు. తేటగుంట మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రత్యంగిర హోమం

అన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం మంత్రపూర్వకంగా ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించి జపాలు, పారాయణ జరిపారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తాండవ సబ్ స్టేషన్ పరిధిలో సీతారాంపురం ఫీడర్‌పై మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ భద్రరావు తెలిపారు. తుని పట్టణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు

గండేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. డీఆర్డీఏ ఏపీఎం సన్యాసిరావు, మండల సమాఖ్య గ్రామ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

'60 పడకల ఆసుపత్రిగా అభివృద్ధికి కృషి'


ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) రౌతులపూడి సీహెచ్‌సీని 30 పడకల నుంచి 60 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు. బుధవారం జరిగిన సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో నెలకు 30 డెలివరీలు, ఆపరేషన్లు చేస్తున్న వైద్యులను అభినందించారు. దాత, సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి దయవల్లే నాలుగు మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. నూతన కమిటీ సభ్యులుగా రెడ్డి చిన్నయ్యనాయుడు (గోవిందు), బండారు సత్యనారాయణలతో ప్రమాణం చేయించారు. తొలుత గ్రామంలో రూ.18లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ కటారి అర్జమ్మ, ములగపూడి సర్పంచ్ తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మండల సాధకుడు రెడ్డి బుల్లాబ్బాయి, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, ఎంపీటీసీ బీజా రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న అరబిందో సంస్థ ప్రతినిధులు

తొండంగి (అన్నవరం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అరబిందో సంస్థ ప్రతినిధి సుధాకర్ పేర్కొన్నారు. సంక్రాంతి, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి 29 వరకు తలపంటిపేట యువత, కాకినాడ సెజ్ అరబిందో ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల నుంచి 80 టీములకు చెందిన 850 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో పాల్మాన్‌పేట, ఎల్లయ్యపేట టీమ్‌లు పోటీపడగా పాల్మాన్‌పేట విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతిగా ట్రోఫీతో పాటు రూ.30వేల నగదు, ద్వితీయ బహుమతిగా ట్రోఫీ, రూ.15వేల నగదు, తృతీయ బహుమతిగా ట్రోఫీ రూ.8వేలు నగదు అందజేశారు.

ప్రజా సేవకు ఎల్లప్పుడూ సిద్ధం: సీఐ సూర్య అప్పారావు

ప్రత్తిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలోని ప్రజలకు నిరంతరం సేవలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. జనావాస ప్రాంతాల్లోను, పరిసరాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను గుర్తించినా పోలీసు అధికారులకు నేరుగా తెలియజేయవచ్చన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్తిపాడు సీఐ 94407 96530, ప్రత్తిపాడు ఎస్‌ఐ 94407 96570, అన్నవరం ఎస్‌ఐ 94407 96571, ఏలేశ్వరం ఎస్‌ఐ 94409 04835, రౌతులపూడి ఎస్‌ఐ 94407 96552 ఫోను చేయవచ్చన్నారు. 112కు డయల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని, ఓటీపీని తెలియజేయవద్దని, సైబర్ నేరాల నుంచి కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే సమయంలో ఇళ్లలోను, బీరువాల్లోను విలువైన బంగారం, నగదు ఉంచొద్దన్నారు. బ్యాంకుల్లోను, బంధువుల వద్ద భద్రపరుచుకోవాలని, ఊరెళ్తున్న విషయాన్ని దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. ప్రజలు ఇళ్ల వద్ద, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరస్తులను గుర్తించడంలో తోడ్పాటునందించినట్టు అవుతుందని సీఐ సూర్య అప్పారావు చెప్పారు.

జగన్ అనైతిక పాలనతో రాష్ట్రానికి తీరని లోటు: ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గత ముఖ్యమంత్రి జగన్ అనైతిక పాలనతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. బుధవారం ఆమె ఒక లేఖలో జగన్ వైఖరిపై ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వైసీపీ కూటమి ప్రభుత్వం నెత్తిన ఏడాదికి రూ.71కోట్లు అసలు వడ్డీ భారం పెట్టిందన్నారు. మొత్తం రూ.1.40వేల కోట్ల ఆర్థిక భారంతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించిన జగన్‌ను ఒక ఆర్థిక నేరగాడిగా అభి వర్ణించారు. తమ నాయకుడు చంద్రబాబు గొప్ప పరిపాలనాదక్షుడని, రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నారన్నారు.

సిరిపురంలో పశు వైద్య శిబిరం

ఏలేశ్వరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సర్పంచ్ పీతల నూకరాజు అన్నారు. సిరిపురంలో పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకురాలు కె.అనిత నేతృత్వంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు మందులు పంపిణీ చేశారు. లేగ దూడలకు ఏలికపాములు, గర్భకోశ వ్యాధి టీకాలు, మందులు అందజేశారు. ఏడాదిలోపు ఆరోగ్యంగా ఉన్న పశువులను పెంచుతున్న రైతులు మజ్జూరి ఈశ్వరుడు, ఇజ్జిన శేషారావు, మజ్జూరి వెంకటరమణలను అధికారులు అభినందించారు. వైస్ సర్పంచ్ రామలింగేశ్వరరావు, చిలకమర్తి ఆదినారాయణ, దొడ్డి శ్రీనివాస్, వైద్యులు వరలక్ష్మి, వెంకటేష్, మంజూష, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హెటెరో పరిశ్రమను సందర్శించిన 'ఆదిత్య' ఫార్మసీ విద్యార్థులు

గండేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు సుమారు 80 మంది పారిశ్రామిక యాత్రలో భాగంగా బుధవారం నక్కపల్లిలోని హెటెరో డ్రగ్స్ పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమలో జరిగే వివిధ ప్రక్రియలను చూశారు. ఉత్పత్తి, నాణ్యత, నియంత్రణ చర్యలను తెలుసుకున్నారు. హెటెరో ల్యాబ్స్ ప్రతినిధులు టీవీ సూర్యప్రకాష్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై రఘురాం వ్యాఖ్యలకు టీడీపీ ఖండన

జగ్గంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత ఒమ్మి రఘురాం చేసిన విమర్శలకు టీడీపీ నేతలు కౌంటర్ ఇచ్చారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అయిన ఆరు నెలల కాలంలోనే చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అయన్ను విమర్శించే స్థాయి రఘురాంకి లేదన్నారు. సమావేశంలో టీడీపీ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాఠంశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు వినతి

కోటనందూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భద్రతా చట్టం ప్రకారం ప్రైవేటు స్కూల్స్, కళాశాలలు, ఫ్యాక్టరీలు, హాస్టల్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ టి.రామకృష్ణ కోరారు. బుధవారం పోలీసులు కోటనందూరులోని స్కూల్స్ కళాశాలల వద్దకు వెళ్లారు. ఎక్కడికక్కడ తగు జాగ్రత్తలు తీసుకుని తమకు సహకరించాలన్నారు.

'తాండవ' పరిధిలో రూ.13కోట్లతో అభివృద్ధి పనులు


కోతకు గురైన గట్టును పరిశీలిస్తున్న తాండవ రిజర్వాయర్ అధికారులు

కోటనందూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ పరిధిలో కుడి, ఎడమ కాలువల కింద రూ.13కోట్లతో 103 పనులకు ప్రతిపాదనలు పంపించామని తాండవ రిజర్వాయర్ ఈఈ బాలసూర్యం పేర్కొన్నారు. కోటనందూరులోని తాండవ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే రూ.13 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని ఆమోదం వచ్చిన వెంటనే పనులు మొదలుపెడతామన్నారు. మార్చిలోపు రూ.2కోట్లతో 18 పనులను యుద్ధప్రాతిపదికన చేస్తామన్నారు. డ్యాం గేట్ల వెంబడి నీరు వృథాగా పోతుండడంతో వెంటనే మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. కోటనందూరులో తాండవ సెక్షన్ కార్యాలయం పూర్తి శిథిలావస్థకు చేరుకుందని, తాండవ రిజర్వాయర్ వైస్ చైర్మన్ మేరపురెడ్డి జోగిబాబు కోరిక మేరకు కొత్త భవనం నిర్మిస్తామన్నారు. నీటి సంఘాల ఎన్నికలు పూర్తయిన దృష్ట్యా తాండవ రిజర్వాయర్ పరిధిలోని కుడి, ఎడమ కాల్వలకు సంబంధించి చిన్న, పెద్ద కాల్వలతో పాటు స్ట్రక్చర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లోని కోటనందూరు, భీమవరపుకోట, కాకరాపల్లి, అల్లిపూడి, కొత్తగూడెం, గొలుగుండపేట, గన్నవరం, గునిపూడి, జగ్గంపేట గ్రామాల్లో దెబ్బతిన్న గట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ అనురాధ, ఏఈలు రవికుమార్, దుర్గబాబు, ప్రేమ్‌కుమార్, శ్యామ్, నీటి సంఘం డైరెక్టర్లు రుత్తల నానాజీ, పెనుముచ్చు నాగేశ్వరరావు, నాగన్నదొర తదితరులు పాల్గొన్నారు.

తుని ఎంపీడీవోకు ఆత్మీయ సత్కారం


తుని ఎంపీడీవో సాయి నవీన్‌ను సత్కరిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

తుని రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో ఎంపీడీవో సాయి నవీన్, ఎనర్జీ ఎస్‌ఈసీ ఆంజనేయులు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎంపీడీవోను ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు.

గణతంత్ర పురస్కార గ్రహీతకు సత్కారం


ఏలేశ్వరంలో వైద్యురాలు శైలజను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఏలేశ్వరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవా అవార్డు అందుకున్న వైద్యురాలు జీఎస్ఎస్‌కే శైలజను బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో టీడీపీ నాయకులు సన్మానించారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వాగు రాజేష్, సామంతుల గోపి, శిడగం బాలు, జొన్నాడ వీరబాబు, రాడ్ల బుజ్జి, రాతికింద సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి టీడీపీ నేత చేయూత



ప్రత్తిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న రాళ్ళ అప్పారావుకు టీడీపీ జిల్లా నాయకుడు రెడ్డి అమర్నాథ్ చౌదరి చేయూతనందించారు. ఆయన సమకూర్చిన రూ.10వేలను గ్రామ పెద్దలు పుట్టావీర్రాజు చౌదరి, రీసు సత్తిబాబు బుధవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు లొండా వెంకటేష్ పాల్గొన్నారు.

భారతీయ కాపు సేవా సమితి ఇన్‌చార్జిగా నాగేశ్వరరావు



జగ్గంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ కాపు సేవా సమితి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా జె.కొత్తూరు గ్రామానికి చెందిన సైతిన నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు కాలవ వెంకటేశ్వరరావు బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గంలో భారతీయ కాపు సేవా సమితి అనుబంధ కమిటీల నియామకం పూర్తి చేస్తామని చెప్పారు.